## క్లుప్తంగా

### క్షీరాభిషేకం



వెంకటాపురం(కె) : మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంతో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణమాదిగ చిత్రపటానికి బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు వేల్పూల మల్లేష్, మండల అధ్యక్షుడు తోకల శివ, యాసం మహేష్, ఆనంద్, బాబురావు, వంశీ, కళ్యాణ్, నర్సింహారావు, లేగల రవి, తదితరులు ఉన్నారు.

### అదుపు తప్పిన టిప్పర్



వాజేడు : మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ సమీపంలో బుధవారం టిప్పర్ అదుపు తప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి వెళ్లింది. వెంకటాపురం(కె) వైపు వెళ్తున్న టిప్పర్ ఒక్కసారిగా రహదారి కిందికి పోవడంతో అక్కడ ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని తెలిసింది.

### విద్యుత్ షాక్‌తో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన శేతుపతి

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని వీరభద్రవరంలో ఇంటి నిర్మాణ పనికి వచ్చి విద్యుత్ షాక్‌తో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గోర్జి గ్రామానికి చెందిన శేతుపతి వీరభద్రవరంలో ఇంటి నిర్మాణ పనుల కోసం వచ్చాడు. కాగా బుధవారం ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటి పై నున్న విద్యుత్ లైన్‌కు తగిలి షాక్‌కు గురయ్యాడని తెలిపారు. విద్యుత్ షాక్‌తో వీపు భాగంలో సగం కాలిందని చెపారు. గమనించిన గ్రామస్తులు 108 వాహనంలో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్



కాటారం : మహాముత్తారం మండలం సింగారం శివారులో పేకాట స్థావరంపై బుధవారం సాయంత్రం పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఏడుగురిని పట్టుకొని రూ.5,340 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

**జూకల్‌లో..**

చిట్యాల : మండలంలోని జూకల్‌లో బుధవారం ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు రెండో ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సూర సొదయ్య ఇంట్లో ఏడుగురు పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.4,950ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఈశ్వరయ్య పేర్కొన్నారు.

### ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కాటారం : మహాముత్తారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న రేణుక ఎల్ల మ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 3న గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఉత్సవ విగ్రహాలకు డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఐదు రోజుల పాటు ఆయా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం కులపెద్దలు పాల్గొన్నారు.

### నియామకం

భూపాలపల్లి రూరల్ : బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ మండల కమిటీని నియమించినట్లు ఆ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ క్యాతం మహేందర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడిగా బండి రమేష్, టేకుమట్ల మండల అధ్యక్షుడిగా చిలక సమ్మయ్య, మహాముత్తారం మండలానికి దండే కృష్ణను నియమించి పత్రాలు అందజేశారు.

# గుప్పుమంటున్న గుడుంబా

- ఏజెన్సీలో ఏరులైపారుతున్న నాటుసారా
- గ్రామాల్లో బహిరంగంగా విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

మంగపేట : మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాల్లో గుడుంబా గుప్పుమంటోంది. దీంతో గుడుంబా తయారీ, విక్రయాలు బహిరంగంగా కొనసాగుతున్నాయి. ఏరులై పారుతున్న నాటుసారా(గుడుంబా) తయారీ, విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీంతో మండలంలోని కమలాపురం, తిమ్మంపేట, బాలన్నగూడెం, మల్లూరు, రాజుపేట తదితర గ్రామాల్లో కొందరు గుడుంబా తయారీని కుటీర పరిశ్రమగా ఎంచుకుని అత్యంత ప్రమాదకరమైన నల్లబెల్లం, యూరియా, పటిక, తదితర రసాయనాలతో గుడుంబాను తయారు చేసి విక్రయదారులకు నేరుగా సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో గల్లీకో గుడుంబా బట్టి, నాలుగు నుంచి ఐదు వరకు గుడుంబా, మద్యం విక్రయాల అడ్డాలు కనిపిస్తున్నాయి.

**విక్రయదారులకు నేరుగా సరఫరా..**

గుడుంబా తయారీపై ఆధారపడ్డ కమలాపురం, తిమ్మంపేట గ్రామాల నుంచి కొందరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై ఐదు నుంచి 10 లీటర్ల గుడుంబాను ప్లాస్టిక్ కవర్లో నింపి బ్యాగుల్లో పెట్టుకుని వివిధ గ్రామాల్లోని కిరాణా షాపుల మాటున్న మద్యం, గుడుంబా విక్రయాలు సాగిస్తున్న నిర్వాహకులకు చేరవేస్తున్నారు. మండలంలోని జిల్లా సరిహద్దు సమీపంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దుగినేపల్లి నుంచి గుడుంబా



తయారీదారులు వందలాది లీటర్ల నాటుసారాను తీసుకువచ్చి మండలంలోని బ్రాహ్మణపల్లి, కత్తిగూడెం, దేవనగరం, రాజుపేట, రమణక్కపేట, చుంచుపల్లి తదితర గ్రామాలకు చేరవేస్తున్నారు.

**ఆబ్కారీ శాఖ అధికారులు ఉన్నట్టా..లేనట్టా?**

మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల వెంట గుడుంబా తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పట్టించుకోక పోవడంతో ఆబ్కారీ శాఖ అధికారులు అసలు ఉన్నట్టా..లేనట్టా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుడుంబా తయారీ పానకం వల్ల దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఆయా కేంద్రాల చుట్టూ ఉన్న ప్రజలు వాపోతున్నారు. గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టాల్సిన అధికారులు నిర్వాహకుల నుంచి ముడుపుల మత్తులో తూగుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. స్థానిక పోలీసులు గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి వేలాది లీటర్ల బెల్లం పానకం, తయారీ పరికరాలు ధ్వంసం చేసిన సంఘటనలు ఉన్నాయి. గుడుంబాను నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో వారిపై వస్తున్న ఆరోపణలకు నిజమనే ఆజ్యాన్ని పోస్తున్నాయి.

**గుడుంబాను అరికట్టేందుకు చర్యలు**

ఏటూరునాగారం సర్కిల్ పరిధిలోని ఐదు మండలాల్లో గుడుంబా తయారీ, విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. మంగపేటపై దృష్టి సారించి నెల రోజుల్లోనే 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశాం. బైండోవర్ ఉల్లంఘన కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి వసూలు చేశాం. గుడుంబాను పూర్తిగా నియంత్రించేందుకు నిత్యం తనిఖీలు చేస్తున్నాం.



\- రామకృష్ణ, ఎక్సైజ్ సీఐ ఏటూరునాగారం

# ‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి

ఎస్ఎస్ తాడ్వాయి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఊరట్టం ఎంపీటీసీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ పథకాల అమలులో విఫలమైందని ఈ విషయాన్ని ప్రతి కార్యకర్త గ్రామాల్లోని ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఊరట్టం, మేడారం, కాల్వపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్నికల సమన్వయ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, జాయ చంద్రం, కొమురయ్య, బాబు, మాజీ సర్పంచ్‌లు శీడం బాబురావు, గొంది శ్రీదేవి, నాయకులు గజ్జెల మహేష్, సమ్మయ్య, నరేష్, స్వరూప, శంకరయ్య, శ్రీను పాల్గొన్నారు. కాగా ఇటీవల మండలంలోని



మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

గొనెపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ఇళ్లు దగ్ధమైన కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. బాధిత కుటుంబానికి వంటసామగ్రి, పాత్రలు, దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. తక్షణ సాయం కింద ఐటీడీఏ నుంచి రూ.20 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**పరామర్శ**

గోవిందరావుపేట : మండల పరిధిలోని చల్వాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్తు భద్రయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహనాయక్‌తో కలిసి బుధవారం పరామర్శించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ఫ్రూట్ ఫాం గ్రామంలో సమావేశమయ్యారు.

### వాహనాల తనిఖీ



వాజేడు : మండల పరిధిలోని మండపాక వద్ద బుధవారం స్థానిక ఎస్సై ఎస్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. జాతీయ రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు.

### ‘కేసులు నమోదు చేయాలి’

వాజేడు : ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా మండలంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాలపై ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలని కోరుతూ తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు ఎట్టి రాజబాబు తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎల్‌టీఆర్, 1/70 చట్టాలకు వ్యతిరేకంగా భూములను కొనుగోలు చేయడమే కాకుండా బహుళ అంతస్తు నిర్మాణాలను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ధర్మవరం, వాజేడు, చెరుకూరు, పేరూరు గ్రామాల్లో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్, బహుళ అంతస్తులపై వెంటనే ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలని రాజబాబు డిమాండ్ చేశారు.

### మహాసభకు తరలిరావాలి

కాళేశ్వరం : ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు..వేల గొంతుకలు మహాసభకు నాయకులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం కాళేశ్వరంలోని ప్రధాన కూడలిలో డప్పు మోగిస్తూ సభను విజయవంతం చేయడానికి కాళేశ్వరంలోని గ్రామ మాదిగలు, మాది ఉప కులాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వర్గీకరణలు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు జిల్లేల నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

- సీపీఎం నాయకుడు రవిగౌడ్

ములుగు రూరల్ : అంకన్నగూడెం బస్ సర్వీస్‌ను హనుమకొండ వరకు నడిపించాలని సీపీఎం మండల నాయకుడు గుండెబోయిన రవిగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాయినిగూడెం, అంకన్నగూడెం మీదుగా హనుమకొండ వరకు బస్ సర్వీస్‌ను నడిపించాలని గ్రామస్తులతో కలిసి అంకన్నగూడెంలో సీపీఎం నాయకులు ధర్నా చేశారు. 35 ఏళ్ల నుంచి వరంగల్-2 డిపో నుంచి బస్ సర్వీస్‌లో ప్రయాణించామని అన్నారు. గత 45 రోజుల క్రితం నుంచి అంకన్నగూడెం గ్రామానికి బస్సు రావడం లేదని, ఈ బస్ సర్వీసును పరకాల



అంకన్నగూడెంలో ధర్నా చేస్తున్న నాయకులు

డిపోకు మార్చడం జరిగిందన్నారు. సర్వీస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుట్టమీద ఆలయ ప్రచార కార్యదర్శి వెంకటేశ్వర్లు, స్వామి, తవిటి నారాయణ, రామారావు, సమ్మయ్య, స్వరూప, పాపయ్య పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

ఏటూరునాగారం : యువత డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కావొద్దని ఎస్సై తాజొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్‌నెట్, మొబైల్స్‌లో వచ్చే గేమ్ లింక్‌లు ఓపెన్ చేసి మీ విలువైన డబ్బును పొగొట్టుకోవద్దని సూచించారు. ధూమపానం, మద్యపానం ఎంత ప్రమాదమో..అంతకన్నా ఆన్‌లైన్ గేమ్స్ అత్యంత ప్రమాదకరమని ఎస్సై వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే ఈజీ మనీని ఎవరు నమ్మి మోసపోవద్దన్నారు. అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే సైబర్ హెల్ప్‌లైన్ 1930 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**

కన్నాయిగూడెం : యోగా చేయడం వల్ల ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ఎస్సై వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ప్రధానోపాధ్యాయుడు దయాసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమానికి ఎస్సై హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడారు. ప్రతీ ఒక్కరు యోగా చేయాలని యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కన్నాయిగూడెం: యోగా చేస్తున్న ఎస్సై, ఉపాధ్యాయులు

# వీఆర్ఏ వారసుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏ వారసుల సంఘం రాష్ట్ర నాయకుడు, జిల్లా జేఏసీ చైర్మన్ చెన్నపురి హరీశ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం భూపాలపల్లిలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో వీఆర్ఏలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలు 80 రోజుల పాటు సమ్మె చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి వీఆర్ఏ వారసుల జేఏసీ నాయకులతో చర్చలు జరిపి జీఓ 81, 85ను విడుదల చేసిందని గుర్తు చేశారు. జీఓల ప్రకారం 20,583 మందిలో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా, ఇంటర్మీడియట్ చదివిన వారికి రికార్డ్ అసిస్టెంట్లుగా, పదో తరగతి చదివిన వారికి ఆఫీసు సబార్డినేటర్స్ రెవెన్యూతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలో సర్దుబాటు చేసిందన్నారు. మిగిలిన 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇస్తామని జీఓలో ప్రకటించి, నేటికీ వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం జీఓ 81, 85 ప్రకారం వీఆర్ఏ వారసులకు తక్షణమే ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని లేనిపక్షంలో వీఆర్ఏలంతా ఐక్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీఆర్ఏ జేఏసీ వైస్ చైర్మన్ గడ్డం రమేశ్, రాజు, మధు, రమేష్, సతీష్, రాజుకుమార్ పాల్గొన్నారు.

# గురుకులాలతో ఉజ్వల భవిష్యత్

కాటారం : తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు గురుకుల పాఠశాలలో చేరాలని మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు బుధవారం ప్రచారం చేశారు. గురుకుల పాఠశాలలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యాబోధన, వసతి, సౌకర్యాలపై ప్రధాన కూడలిలో కరపత్రాలను ప్రదర్శిస్తూ ప్రచారం చేపట్టారు. 5వ తరగతిలో ప్రవేశం, 6 నుంచి 9 తరగతుల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని వారు వివరించారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్థానిక మీ సేవా కేంద్రాల్లో విద్యార్థికి సంబంధించి ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటో, స్టడీ సర్టిఫికెట్ సమర్పించి ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేయాలని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, హరిభూషన్, రాజు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



కాటారం కూడలిలో ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

# విద్యార్థులకు సైన్స్ ప్రతిభా పరీక్షలు

వాజేడు : ఫిబ్రవరి 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని పోటీపరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంలో భాగంగా ఈ పోటీలను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు తెలిపారు. బుధవారం పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో రోషిని, శిరీష, ధనలక్ష్మి మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు వెల్లడించారు. 31వ తేదీన మండల స్థాయిలో ప్రతిభా పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు రంగు ఆనంద్, తోటి ఉపాధ్యాయులు ఉన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వెంకటాపురం(కె) : పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ శివ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అలుబాకలో బీఎస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు తమ వంతు కృషి చేయాని పిలుపునిచ్చారు. అనంతరం అలుబాక గ్రామానికి చెందిన పది కుటుంబాలు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంబాబు, కొండా చరణ్, రంగనాథ్, మోహన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

# సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించండి

వాజేడు : మండల పరిధిలోని ప్రగళ్లపల్లి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ విజయకు స్థానిక మహిళలు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఇళ్లల్లోకి నీరు వస్తోందని దీంతో తాము అనారోగ్యాల బారిన పడుతున్నట్లు వారు ఎంపీడీఓకు వివరించారు. సమ్మక్క, రజని, ఎల్లమ్మ, రాధ, దేవి, వెంకట నర్సు తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

**సీసీరోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు**

ఏటూరునాగారం : మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణానికి మంత్రి సీతక్క రూ.2.50కోట్లు మంజూరు చేశారని, మంత్రికి రుణపడి ఉంటానని ఎర్రబెల్లి మనోజ్‌కుమార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి సీసీ రోడ్డు నిధులు మంజూరు చేసిన ప్రొసిడింగ్ పత్రాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ముక్కెర లాలయ్య ఇంటి నుంచి పానెం సాంబశివరావు ఇంటి (ఓడవాడ) వరకు రూ.2.50 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి సీతక్క కృషితో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

### భూసార పరీక్షలు

వాజేడు : మండలంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భూసార పరీక్షలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 333 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయాల్సి ఉంది. కాగా జంగాలపల్లి, ఉప్రగళ్లపల్లిలో ఏఈఓలు జాఫర్, హరీశ్ 20 మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి పరీక్షల కోసం రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారికి సంప్రదించాలని లేదా 500 గ్రాముల మట్టి శాంపిల్స్‌ను ఏఈఓలకు ఇవ్వాలని పేర్కొన్నారు.



# ‘ఉపాధి’ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి



ఏటూరునాగారం: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది



వాజేడు: వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

ఏటూరునాగారం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వర్తిస్తున్న మూడు నెలల నుంచి తమకు వేతనాలు అందడం లేదని ఈజీఎస్ ఏపీఓ చరణ్ పేర్కొన్నారు. ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలకు వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నామని బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మికి ఈజీఎస్ ఉద్యోగులు, సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమం పూర్తిస్థాయిలో కేటాయించి విజయవంతం చేశామన్నారు. పే స్కేల్‌కు సంబంధించి ఫిబ్రవరి 2న ఆదిలాబాద్‌లో జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క హామీ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాల్యాద్రి, అనిత, వినిత, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

**నల్లబ్యాడ్జీలతో ఉపాధి సిబ్బంది నిరసన**

వాజేడు : తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర, జిల్లా జేఏసీ పిలుపు మేరకు మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది తమకు రావాల్సిన మూడు నెలల వేతనాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ ఎంపీడీఓ విజయకు వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రకటించిన పే స్కేల్ వెంటనే అమలు చేయాలని కోరారు. ఏపీఓ రాజు, గౌరి బాబు, రాంబాబు, స్వప్న ఉన్నారు.

# గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



భూపాలపల్లి రూరల్ : గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని నాగారం డిస్పెన్సరీ డాక్టర్ అనూష సూచించారు. బుధవారం నాగారంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ రజిత ఆధ్వర్యంలో అన్నప్రాసన నిర్వహించారు కార్యక్రమానికి అనూష ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.గర్భిణులు, బాలింతలు తగిన పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు.వివిధ వయస్సుల వారికి కొలతల ప్రకారం సమతుల ఆహారం పిల్లలకు తినిపించినప్పుడు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలోఅంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, టీచర్ స్వర్ణలత, సరిత, పిల్లల తల్లులు, గర్భిణులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.